
సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 30 । నవంబర్ । 2023



వ్యాయామ విద్యకు ప్రోత్సాహం

పాఠశాల, జూనియర్ కళాశాలల్లో వ్యాయామ విద్యపై ప్రభుత్వం దృష్టి సారించింది. విద్యార్థులందరికీ క్రీడా పరికరాలు అందజేస్తోంది.

- 8లో



హుదూద్ ఇళ్లకు మోక్షం

టెక్కలిలో హుదూద్ ఇళ్లకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. గురువారం 90 మందికి లాటరీ విధానంలో ఇళ్లు కేటాయించనున్నారు.

- 8లో

రేపటి నుంచి బీఎడ్ మూల్యాంకనం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో బీఎడ్ మొదటి ఏడాది జవాబుపత్రాల మూల్యాంకనం డిసెంబర్ ఒకటి నుంచి నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం చెప్పారు. మూడు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేసి త్వరలోనే ఫలితాలు వెల్లడిస్తామన్నారు. బీఈడీ కళాశాలల రేటిఫికేషన్ సైతం పూర్తిచేస్తామని చెప్పారు.

న్యూస్‌రీల్

ఆదాయ వనరులు పెంచుకోవాలి



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న సహాయ కమిషనర్ అశోక్

నరసన్నపేట: ఉపాధి వేతనదారులు ఆదాయ వనరులను పెంచుకున్నప్పుడే కుటుంబ ఆర్థిక వ్యవస్థ బాగుంటుందని ఎన్‌ఆర్‌ఈజీఎస్ సహాయ కమిషనర్ (విజయవాడ) అశోక్ అన్నారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన తామరాపల్లిలో ఉపాధి వేతనదారులతో మాట్లాడారు. రోజువారీ వేతనం, పని గంటలపై ఆరా తీశారు. సొంత పొలాలు ఉంటే వాటిలో పండ్ల తోటలు పెంచుకుంటే ఉపాధి పథకాన్ని అనుసంధానం చేస్తామని చెప్పారు. వాటి ద్వారా కూడా ఆదాయం పెంచుకోవచ్చన్నారు. భూములు ఉన్న రైతులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు, నరసన్నపేట ఏపీఎం యుగంధర్, ఈసీ అప్పలరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు ముచ్చ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

యాంటీ బయాటిక్స్ వాడకం తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు

గార: చేపలు, రొయ్యల పెంపకంలో యాంటీ బయాటిక్స్ వాడకం తగ్గించాలని జిల్లా మత్స్యశాఖ జేడీ పి.వి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం గార మండలం శ్రీకూర్మం పంచాయతీలో చేపలు, రొయ్యల పెంపకందారులకు కేంద్రప్రభుత్వ సంస్థ నాస్కా ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాక్టీరియా, వైరస్, శిలీంధ్రాలు, పరాన్నజీవులు కాలక్రమేణా మారినప్పుడు, మందులకు ప్రతిస్పందించనప్పుడు అంటువ్యాధులను నివారించడం కష్టతరమవుతుందన్నారు. వ్యాధి వ్యాప్తి తీవ్రమై మరణాల రేటు పెరుగుతుందన్నారు. ఈ క్రమంలో యాంటిబయాటిక్స్ విస్తృతంగా ఉపయోగిస్తే మరిన్ని సమస్యలు ఏర్పడతాయన్నారు. మెరుగైన నీటి నాణ్యత వంటి ఆక్వాకల్చర్ పద్ధతులను అమలు చేయడంతో వ్యాధి నియంత్రణ చేపట్టవచ్చని చెప్పారు. కార్యక్రమంలో నాక్సా ఆర్‌సీవో ఎస్‌పీ చంద్రశేఖర్, ఏఎంఆర్ డాక్టర్ సీహెచ్.బాలకృష్ణ, డాక్టర్ షణ్ముఖ, ఎస్.బాలాజీ, గోర సురేష్, పి.రాము తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పీజీ సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం కేంద్రంగా వర్సిటీ, అఫిలియేషన్ పోస్టు గ్రాడ్యుయేషన్ మూడో సెమిస్టర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయని ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. డిసెంబర్ 8 వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. సైన్స్ కోర్సుల నుంచి 375, ఆర్ట్స్ కోర్సుల నుంచి 143 మంది హాజరు కానున్నారని తెలిపారు.

9న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: డిసెంబర్ 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనంత ఎక్కువగా క్రిమినల్ కేసులు రాజీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. బుధవారం జిల్లా కోర్టులోని కాన్ఫరెన్స్ హాలులో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల సమయం, ఖర్చులు ఆదా అవుతాయన్నారు. పోలీస్ స్టేషన్లకు, కోర్టులకు కూడా పని భారం తగ్గుతుందన్నారు. సమావేశంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు శ్రీదేవి, మహేంద్ర ఫణి కుమార్, భాస్కరరావు, అడిషనల్ సీనియర్ న్యాయమూర్తి అనురాధ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, అడిషనల్ ఎస్పీ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

పుర్రెకో బుద్ధి.. జిహ్వకో రుచి.. అన్నారు పెద్దలు. దాన్ని నిజం చేస్తూ కాలం మారుతున్న క్రమంలోనే మనుషుల అలవాట్లు.. రుచులు, అభిరుచులు మారుతున్నాయి. ఎప్పుడూ తిన్నవే తింటే నాలుక చచ్చిపోతుంది అని చాలా మంది అంటుంటారు. అందుకే నగరవాసులు సంప్రదాయ ఆహార పదార్థాలను పక్కన పెట్టి కొత్త కొత్త రుచులను ఆహ్వానిస్తున్నారు.. ఆస్వాదిస్తున్నారు. మారుతున్న ప్రజల అభిరుచులను పసిగట్టి కొత్త పదార్థాలను అందుబాటులోకి తెచ్చి వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటున్నారు నిర్వాహకులు. బుర్రకు పదునుపెట్టి.. వ్యాపారానికి సృజనాత్మకత జోడిస్తున్నారు. దాని ఫలితమే.. గాడిద, ఒంటె, మేక పాలతో ఐస్ క్రీముల సృష్టి. ఆవు, గేదె పాలతో చేసిన పదార్థాలనే ఇప్పటివరకు రుచి చూస్తున్న ప్రజలకు.. ఈ నయా హిమ క్రీములు తెగ నచ్చేస్తున్నాయి. చలి కాలంలోనూ హాట్ హాట్ అమ్మకాలే దీనికి నిదర్శనం.

వెరైటీ హిమక్రీములు..
హాట్ హాట్ అమ్మకాలు!



- గాడిద, ఒంటె, మేకపాలతో మార్కెట్‌లోకి ఐస్‌క్రీమ్‌లు
- బెల్లం, సుగర్ లెస్ ఐస్‌క్రీమ్‌లకు యమ డిమాండ్
- భలే రుచిగా ఉన్నాయంటున్న శ్రీకాకుళం నగర వాసులు
- కొత్త ట్రెండ్‌ను స్వాగతిస్తున్నారంటున్న అమ్మకందారులు

శ్రీకాకుళం డెస్క్:

గంగి గోవు పాలు గరిటెడైనను చాలు..
కడవడైననేమి ఖరము పాలు..
ఇది నాటి వేమన మాట..
మరి నేడు..

గంగిగోవు పాలతో ఖరము పాలు పోటీ పడుతున్నాయి. ఆరోగ్యం, రోగాలు నయం చేసే ప్రక్రియల్లో వినియోగం.. ఇతరత్రా కారణాలతో గోవుపాల కంటే కూడా గాడిద పాలకే గిరాకీ ఎక్కువైంది. మరో అడుగు ముందుకేస్తే ఆర్గానిక్ పేరుతో జరుగుతున్న వ్యాపారాల్లో గాడిద పాలతో తయారు చేసిన ఐస్‌క్రీమ్‌లను వయసుతో సంబంధం లేకుండా ఆస్వాదిస్తున్నారు శ్రీకాకుళం నగర వాసులు. ఒక్క గాడిద పాలేం ఖర్మ.. ఒంటె పాలు.. మేక పాలతో తయారు చేసిన హిమ క్రీముల రుచులకు ఫిదా అంటున్నారు జనం.

హిమక్రీము రోజురోజుకూ రూపం మార్చుకుంటోంది. చాలా పదార్థాలను తనలో ఇముడ్చుకుని సరికొత్త రుచులతో ఫుడ్ లవర్స్ నోట్లో కరిగిపోతోంది. ఆర్గానిక్ పేరుతో అద్భుతమైన రుచుల సంగమంతో పార్లర్లలో ఐస్‌క్రీమ్‌ను సర్వ్ చేసి శభాష్ అనిపించుకుంటున్నారు అమ్మకందారులు.

ఆర్గానిక్ ఐస్‌క్రీమ్‌లు..

వ్యవసాయ ఉత్పత్తులు మాదిరిగానే ఐస్‌క్రీమ్‌లకు ఆర్గానిక్ ట్యాగ్ వచ్చేసింది. ఐస్‌క్రీమ్ తయారీలో దేశీయ ఆవుపాలు (ఏ2 మిల్క్), ఆర్గానిక్ బట్టర్, పటిక బెల్లం, ఆర్గానిక్ విధానంలో పండించిన పళ్లు, గోంధు చెట్టు గమ్ము, సోయాను వినియోగించి తయారు చేసిన ఆర్గానిక్ కలర్స్‌ను వినియోగించి ఐస్‌క్రీమ్‌లను తయారు చేస్తున్నారు. కస్టమర్ ఆరోగ్య పరిరక్షణే తమ ధ్యేయమని చెబుతున్నారు అమ్మకందారులు.

సీజన్‌తో పనిలేకుండా..

సీతాఫలం, పనస, మామిడి వంటి సీజనల్ పండ్ల రుచులు ఆస్వాదించాలంటే మా పార్లర్లకు రమ్మని ఆహ్వానిస్తున్నారు నిర్వాహకులు. సీజన్‌తో సంబంధం లేకుండా ఫ్రూట్ పేరు చెబితే చాలు చక్కనైన చిక్కనైన ఐస్‌క్రీమ్‌ను మనముందు ఉంచుతున్నారు. అంతేనా నచ్చిన నట్స్‌ను కూడా యాడ్ చేసి జిహ్వా చాపల్యాన్ని తీరుస్తున్నారు. వాటి రుచిని ఆస్వాదిస్తే అచ్చం ఆ పండు తిన్న ఫీలింగే కలుగుతుంది.

● డాంకీ ఐస్ క్రీమ్ ధరే ఎక్కువ..



కంట్రీమిల్క్ ఐస్ క్రీమ్‌ల పేరుతో వివిధ జంతువుల పాలతో ఐస్‌క్రీమ్‌లను తయారు చేస్తున్నారు. అందులో ఒంటె, గాడిద, మేక పాలతో తయారు చేసిన ఐస్‌క్రీమ్‌లకు డిమాండ్ బాగా ఉందని చెబుతున్నారు. విభిన్నమైన రుచి వీటి సొంతం కావడంతో ఆస్వాదించేందుకు మొగ్గు చూపుతున్నారు నగరవాసులు. అంతేకాకుండా గాడిద, ఒంటె, మేక పాలల్లో ఔషధగుణాలు ఉండడం కూడా వీటి ఆదరణకు ఓ కారణమని చెబుతున్నారు నిర్వాహకులు. అయితే ఒంటె, మేక పాలతో తయారైన ఐస్‌క్రీమ్‌ల ధరలు రూ.150కి అటు ఇటూ ఉన్నప్పటికీ గాడిద పాలతో తయారు చేసిన 125 మిల్లీలీటర్ల ఐస్ క్రీమ్ ధర మాత్రం అక్షరాలా రూ.450 ఉంది.

విభిన్నంగా ఉండాలని..



నగర వాసులకు వెరైటీగా అందించాలనే ఉద్దేశంతో పార్లర్‌ను స్టార్ట్ చేశా. వివిధ రకాల జంతువుల పాలతో తయారు చేసిన ఐస్‌క్రీమ్‌లకు డిమాండ్ బాగానే ఉంది. ఆర్గానిక్ ఐస్‌క్రీమ్‌లను నగరవాసులు బాగా ఇష్టపడుతున్నారు.

- బి.వికాస్, పార్లర్ నిర్వాహకుడు

డిఫరెంట్ టేస్ట్..



నగరంలో ఐస్‌క్రీమ్ పార్లర్లు విభిన్న రుచుల్ని అందిస్తున్నాయి. కంట్రీ మిల్క్‌తో చేసిన ఐస్‌క్రీమ్‌లు, ఆర్గానిక్ ఫ్లేవర్స్ ఆస్వాదిస్తుంటే చాలా బాగున్నాయి.

-సందీప్

సుగర్ ఫ్రీ.. బెల్లంతో మజా..

మధుమేహ వ్యాధిగ్రస్తులు. సుగర్ వినియోగానికి దూరంగా ఉండే వారి కోసం సుగర్ ఫ్రీ, సుగర్ లెస్ ఐస్‌క్రీమ్‌లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. అలాగే బెల్లంతో తయారైన ఐస్‌క్రీమ్‌లకు గిరాకీ బాగానే ఉందని చెబుతున్నారు దీపామహల్ రోడ్‌లోని ఐస్‌బర్గ్ పార్లర్ నిర్వాహకులు వికాస్. బెల్లం, సుగర్ లెస్ ఐస్‌క్రీమ్‌లలో 32 ఫ్లేవర్స్ తమ వద్ద లభ్యమవుతున్నాయని చెప్పారు. వీటి ధరలు రూ.59 నుంచి రూ.99 వరకు ఉన్నాయి.



థాలీ భుజించేద్దాం...



థాలీ పేరు వినే ఉంటారు. పెద్ద హోటళ్లలో చక్కనైన భోజనాన్ని థాలీ అని పిలుస్తారు. 10 రకాల చిన్న చిన్న గిన్నెల్లో విభిన్న రకాల కూరలు.. పాయసం.. పప్పు.. రసం ఇలా అన్ని కలిపి పెద్ద పళ్లెంలో భోజనాన్ని వడ్డిస్తారు. దాని మాదిరిగానే ఐస్‌క్రీమ్ పార్లర్లలో కూడా ఐస్‌క్రీమ్ థాలీని వడ్డిస్తున్నారు. ఇందులో ఎనిమిది రకాల ఫ్లేవర్స్‌తో కూడిన హిమక్రీములను పళ్లెంలో అందిస్తున్నారు. ముగ్గురికి సరిపోతుందని చెబుతున్నారు అమ్మకందారులు. దీనికి రూ.399 వరకు చార్జీ చేస్తున్నారు. ఇందులో బేసిక్ ఫ్లేవర్స్‌తో పాటు నట్స్‌ను యాడ్ చేసి భోజన ప్రియుల మనసు దోచుకుంటున్నారు.

పైడి భీమవరంలో
ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్

- రూ.14.60 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం
- వర్చువల్ పద్ధతిలో ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి
- పరిశ్రమల ఏర్పాటుకు సంపూర్ణ సహకారం: కలెక్టర్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ ఆధ్వర్యంలో పైడిభీమవరంలో రూ.14.60 కోట్ల వ్యయంతో నిర్మించిన ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఒక్కరోజే రూ.1,072 కోట్లతో రాష్ట్రంలో ఏర్పాటు చేసిన పలు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం సంతోషంగా ఉందన్నారు. వీటి ద్వారా 22 వేల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు.

● కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ రెండెకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ కాంప్లెక్స్‌లో వివిధ రకాల పరిశ్రమలను నెలకొల్పేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వపరంగా అన్ని సహాయ సహకారాలను అందిస్తామన్నారు. ఇప్పటికే రోడ్లు, విద్యుత్, ప్రహరీ, మంచినీటి సదుపాయం కల్పించామని చెప్పారు. రానున్న రెండేళ్లలో 1500 మందికి ఇక్కడ ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రూ.30 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నామని తెలిపారు. మూలపేట పోర్టు, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం పూర్తయితే పారిశ్రామికంగా జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా పరిశ్రమలశాఖ జీఎం ఉమామహేశ్వర రావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బి.హరిధరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగిని ఆత్మహత్య

- గార ఎస్‌బీఐలో బంగారు నగల మాయం ఘటన
- మనస్థాపంతో ఐదు రోజుల ముందే ఎలుకల మందు తాగిన వైనం
- చికిత్స పొందుతూ విశాఖలో మృతి



మృతిచెందిన బ్యాంకు ఉద్యోగిని స్వప్నప్రియ

శ్రీకాకుళం క్రైమ్ :

నగరంలోని పీఎన్‌కాలనీలో నివాసముంటున్న ఓ బ్యాంకు ఉద్యోగిని ఎలుకల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. శ్రీకాకుళం రెండో పట్టణ ఎస్‌ఐ కె.లక్ష్మి తెలిపిన వివరాల మేరకు.. పీఎన్‌కాలనీ మొదటి లైన్ సాయిసత్య అపార్ట్‌మెంట్‌లో ఉరిటి స్వప్నప్రియ(39) తల్లి సరళ, సోదరుడు కిరణ్‌బాబులతో కలిసి నివాసముంటోంది. స్వప్నప్రియ గార మండలం స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచి ఆఫీసులో డిప్యూటీ మేనేజరు/అకౌంటెంట్‌గా, కిరణ్‌బాబు శ్రీకాకుళం ఎస్బీఐ రీజియన్‌లో పనిచేస్తున్నారు. వీరి స్వగ్రామం నరసన్నపేట సమీపంలోని యారబాడు. స్వప్నప్రియకు 2010లో శ్రీకాకుళానికి చెందిన కుప్పిలి ప్రదీప్‌కుమార్‌తో వివాహం జరిగినా అభిప్రాయ భేదాలు రావడంతో 2019లో ఇద్దరూ విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి తాను ఒంటరిననే బాధతో ఉండేవారు.

తనఖా బంగారం మాయమవ్వడంతో..

గార ఎస్‌బీఐలో ఖాతాదారులు తనఖా పెట్టిన రూ.3 కోట్ల బంగారం మాయమైందని, దీని వెనుక డిప్యూటీ మేనేజర్/అకౌంటెంట్‌గా ఉన్న ఓ మహిళా ఉద్యోగినితో పాటు కొందరి హస్తముందని కొన్ని పత్రికల్లో (సాక్షి కాదు) వరుస కథనాలు వస్తున్నాయి. ఖాతాదారులు బ్యాంకు వద్ద ఆందోళనకు దిగడం, చివరకు బుధవారం గార సీఐ కామేశ్వరరావు సమక్షంలో రీజనల్ మేనేజర్ ఖాతాదారులకు బంగారం ఇప్పించే బాధ్యత తనదని సర్దిచెప్పి వెళ్లిపోయారు.

ఆ కథనాలతో మనస్థాపం చెంది..

పత్రికల్లో వస్తున్న కథనాలు తన గురించే అని ఇంటి వద్ద తల్లితో చెప్పి స్వప్నప్రియ తీవ్రంగా మనోవేదన చెందేదని, సోషల్ మీడియాలో కూడా కావాలనే తనపై తప్పుడుగా ప్రచారం చేస్తున్నారని స్వప్నప్రియ వాపోయేది. ఈ క్రమంలో ఈ నెల 24న బయటకు వెళ్లి వచ్చిన స్వప్నప్రియ వాంతులు చేయడంతో తల్లి ఆందోళన చెందింది. ఏమైందని అడగ్గా.. తన బతుకు ఇలా అయిపోయిందని ఏడుస్తూ పడుకుంది. మరుసటి రోజు నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చి ఎలుకల మందు తాగానని తల్లితో చెప్పింది. అప్పటి నుంచి మందులు వాడుతున్నా వాంతులు తగ్గలేదు. ఈక్రమంలో ఆరోగ్యం రోజురోజుకీ క్షీణిస్తుండటంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా బుధవారం ఉదయం మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అంత్యక్రియల కోసం మృతదేహాన్ని స్వప్నప్రియ స్వగ్రామం యారబాడుకు తరలించనున్నట్లు ఎస్ఐ లక్ష్మి చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సంక్షేమ పథం



పాఠశాలల సుందరీకరణ అద్భుతం



కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు ఆధునీకరణ చేశారు. గతంలో పాఠశాలలు కనీస సౌకర్యాలు లేక అధ్వానంగా ఉండేవి. ఈ ప్రభుత్వం వచ్చాక పాఠశాల సుందరీకరణ, విద్యార్థుల సంక్షేమం, చక్కటి భోజనం సక్రమంగా అమలు చేస్తున్నారు. దీంతో విద్యార్థులు చదువుపై దృష్టిసారిస్తున్నారు. మెరుగైన ఫలితాలు పొందగలుగుతున్నాం.

– కె.కమలాకర్, ఉపాధ్యాయుడు, చిగురువలస ఎంపీపీ స్కూల్, సరుబుజ్జిలి

కల నెరవేరింది



ఇల్లు లేకపోవడంతో పదేళ్లుగా అద్దె ఇంట్లో ఉండాల్సి వచ్చేది. గత ప్రభుత్వాల హయాంలో ఇంటి స్థలం కోసం ఎన్ని సార్లు దరఖాస్తులు ఇచ్చినా ఫలితం లేకుండాపోయింది. కూలీ పనులు చేసుకుని జీవించే మాకు సొంత ఇల్లు లేకపోవడం భారంగా ఉండేది. ఈ పరిస్థితిలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వచ్చాక ఇంటి స్థలంతో పాటు పక్కా గృహం నిర్మాణానికి ప్రభుత్వం చేయూత అందించడంతో ఇంటిని నిర్మించుకోగలిగాం. సొంత ఇంటికి యజమాని అయినందుకు సంతోషంగా ఉంది.

– డి.రాజు, ఇసుకలపేట, ఆమదాలవలస మండలం

ఉద్దానం ఆశా దీపం..
ప్రారంభానికి సిద్ధం

- ప్రారంభోత్సవానికి 12న ముఖ్యమంత్రి జగన్ రాక
- యంత్రాలను పరిశీలించిన మంత్రి సీదిరి అప్పలరాజు



కిడ్నీలో రాళ్లను కరిగించే యంత్రం పనితీరు వివరిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: కిడ్నీ వ్యాధులకు కేరాఫ్ అడ్రాస్‌గా ఉన్న ఉద్దానానికి ఆయుర్దాయం పెంచే క్రమంలో పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్‌స్పెషాలిటీ ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ప్రజా సంఘ నాయకులతో కలిసి బుధవారం పలాసలోని కిడ్నీ ఆస్పత్రిని సందర్శించారు. ముందుగా పలువురు ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ 40 ఏళ్లుగా కిడ్నీ మహమ్మారి కారణంగా వేలాది మంది ఉద్దానవాసులు ప్రాణాలు కోల్పోయారని, తమ ప్రాణాలను కాపాడే దేవుడు ఎప్పటికైనా రాకపోడా అనే ఆశతో ఇన్నాళ్లు బతికారని.. ఈ పరిస్థితిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చొరవ తీసుకుని కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రుల కల సాకారం చేశారని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ డిసెంబర్ 12న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలాస వచ్చి వీటిని ప్రారంభిస్తారని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో యూడీఎఫ్, యు.వి.వి, ఎస్‌వీఎస్‌ఎస్, న్యూ డెమొక్రసీ, ప్రగతిశీల, సీపీఐ, సీపీఐఎంఎల్ లిబరేషన్, రైతుకూలీ సంఘం, జీడి రైతాంగ సంఘం, పలాస యూత్ అసోసియేషన్, ఉద్దానం ఫౌండేషన్, పలాస లేబర్ అసోసియేషన్, గ్రీన్ ఆర్మీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



డయాలసిస్ కేంద్రం పనితీరు చూస్తున్న మంత్రి సీదిరి

క్లుప్తంగా

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి



మహిళ మృతదేహం

నందిగాం/వజ్రపుకొత్తూరు : పూండి – నౌపడ రైల్వేస్టేషన్ల మధ్య రౌతుపురం పాసింజర్ హాల్టు సమీపంలో భువనేశ్వర్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఢీకొని రైలు ఢీకొని బుధవారం గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ ఎస్కే షరీఫ్ తెలిపారు. మృతురాలి సుమారు 45 ఏళ్ల వయసు కలిగి ఆకుపచ్చ దుస్తులు ధరించి ఉందని, ఆమె వద్ద ఉన్న ఆనవాళ్ల బట్టి పరిసర ప్రాంతాలకు చెందిన మహిళ అయి ఉంటుందని చెప్పారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచామని, వివరాలు తెలిసిన వారు 9440627567 నంబరుకు సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



బ్యాంకు నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

కొత్తూరు: ప్రభుత్వ పథకాల అమల్లో యూనియన్ బ్యాంకు అందిస్తున్న సేవలు అభినందనీయమని సీతంపేట ఐటీడీఏ పీవో కల్పనా కుమారి అన్నారు. కొత్తూరులో బుధవారం యూనియన్ బ్యాంకు బ్రాంచి నూతన భవనాన్ని పీఓ ప్రారంభించారు. బ్రాంచి మేనేజర్ రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీఓ మాట్లాడుతూ పలు రకాల రాయితీ రుణాలతో పాటు ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందించడంలో యూనియన్ బ్యాంకు ముందంజలో ఉందని ప్రశంసించారు. బ్యాంకు శ్రీకాకుళం రీజనల్ హెడ్ వెంకట్ తిలక్ మాట్లాడుతూ ఖాతాదారులకు సేవలు విస్తతం చేయాలన్న ఆలోచనతో నూతన భవనంలోకి బ్రాంచిని మార్పు చేసినట్లు చెప్పారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలో 56 శాఖల్లో కొత్తూరు బ్రాంచి రూ.146 కోట్ల టర్నోవర్‌తో ముందంజలో ఉందని వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, విశ్రాంతి ఉపాధ్యాయుడు సెట్టి భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

విజయాలతో తిరిగిరావాలి



యోగా క్రీడాకారులతో వీసీ, రిజిస్ట్రార్

ఎచ్చెర్ల క్యాంపస్: యోగా క్రీడాకారులు విజయాలతో తిరిగి రావాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు ఆకాంక్షించారు. చెన్నైలోని అన్నా విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 1 నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల యోగా పోటీలకు క్రీడాకారులు బృందం బుధవారం పయనమైంది. వీరికి వీసీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



అండర్-19 క్రికెట్ పోటీలకు ఎంపికైన బాలురు

పాతపట్నం : క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సీనియర్ పీడీ వై.శేఖర్‌బాబు అన్నారు. పాతపట్నం ఆల్‌ఆంధ్ర రోడ్డు సమీపంలోని మహేంద్ర డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-19 క్రికెట్ బాల, బాలికల ఎంపికలు బుధవారం నిర్వహించారు. 63 మంది బాలురు, 47 మంది బాలికలు ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జి.అప్పన్న, ప్రిన్సిపాల్ కె.వి.రత్న కుమారి, పీఈటీలు శ్రీను, రావ్, కృష్ణారావు, లక్ష్మీనారాయణ, లోకేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఎలక్ట్రికల్ హీటర్



జామి మౌనిక(ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని చినబరాటం వీధిలో ఎలక్ట్రికల్ హీటర్ షాక్ కొట్టడంతో వివాహిత మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చినబరాటం వీధిలో నివాసముంటున్న జామి అనిల్ మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నారు. ఇతని భార్య మౌనిక (24) గురువారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో స్నానానికని నీటిని మరిగించేందుకు ఎలక్ట్రికల్ హీటర్ పెట్టింది. ఆపేటప్పుడు స్విక్‌ను పట్టబోయి బకెట్‌లో ఉన్న వైర్‌ను పట్టుకోవడంతో వెంటనే షాక్‌కు గురై కింద పడిపోయింది. ఇంట్లోనే ఉన్న భర్త వచ్చి చూసేసరికే మృతిచెందింది. ఈ విషయమై తమకు సమాచారం అందిందని ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు.

హుదూద్ ఇళ్లకు మోక్షం

- టెక్కలి నియోజకవర్గంలో 558 గృహాల నిర్మాణాలు
- నేడు తొలి విడతగా 90 మందికి లాటరీ విధానంలో కేటాయింపు
- గత టీడీపీ హయాంలో ఇళ్లు పంచుకునేందుకు ప్రయత్నించిన తెలుగుతమ్ముళ్లు
- ప్రస్తుత ప్రభుత్వంలో అర్హులైన నిరుపేదలకు అందేలా చర్యలు



టెక్కలిలో లబ్ధిదారుల కోసం సిద్ధమైన హుదూద్ ఇళ్లు

టెక్కలి: దాదాపు దశాబ్ద కాలంలో టెక్కలి నియోజకవర్గంలో నిరుపయోగంగా ఉన్న హుదూద్ ఇళ్లకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో హుదూద్ ఇళ్లను పంచుకోవాలని తెలుగు తమ్ముళ్ల విశ్వప్రయత్నాలు ఫలించలేదు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన నిరుపేదలకు ఇళ్లు అందజేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. టెక్కలి మండలానికి సంబంధించి సుమారు 90 మంది లబ్ధిదారులకు హుదూద్ ఇళ్లు కేటాయించేందుకు గురువారం లాటరీ ప్రక్రియ చేపట్టనున్నారు. టెక్కలి తహసీల్దారు కార్యాలయం ఆవరణలో మధ్యాహ్నం 3 గంటలకు లాటరీ తీసి అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించేందుకు అధికారులు జాబితాలు సిద్ధం చేశారు.

పంచుకునేందుకు ప్రయత్నం..

2014లో సంభవించిన హుదూద్ తుఫాన్ ధాటికి నిరాశ్రయులైన వారి కోసం టెక్కలిలో 192, సంతబొమ్మాళిలో 176, కోటబొమ్మాళిలో 192 హుదూద్ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. గత టీడీపీ హయాంలో ఆ ఇళ్లను పంచుకోవడానికి ఆ పార్టీ కార్యకర్తలు విశ్వప్రయత్నాలు చేశారు. అప్పట్లో ప్రతిపక్ష హోదాలో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు. ఇదే సమయంలో ఎన్నికలు సమీపించడంతో వారి ప్రయత్నాలకు అడ్డుకట్ట పడింది. ఇప్పుడు ఎట్టకేలకు హుదూద్ ఇళ్లకు మోక్షం కలిగింది.

అర్హులకే అందేలా..



హుదూద్‌లో నిరాశ్రయులైన వారి కోసం నిర్మించిన 558 ఇళ్లను గత ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలు దోచుకోవాలని ప్రయత్నించారు. వారి ప్రయత్నాలు ఫలించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లు లేని నిరుపేదల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచి కార్యక్రమాల్లో భాగంగా టెక్కలి నియోజకవర్గంలో మూలన పడిన హుదూద్ ఇళ్లను పేదలకు కేటాయించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. మొదటి విడతగా టెక్కలి మండలంలో 90 మందికి లాటరీ ద్వారా ఇళ్లు కేటాయిస్తారు. ఆ తరువాత మిగిలిన మండలాల్లో అర్హులైన ఇళ్లు అందిస్తారు.

– దువ్వాడ వాణి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త

గడువులోగా ఇళ్ల నిర్మాణం పూర్తవ్వాలి



మాట్లాడుతున్న గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్ మైదీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా గృహాల నిర్మాణం గడువులోగా పూర్తి కావాల్సిందేనని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్ మైదీన్ స్పష్టం చేశారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గృహనిర్మాణ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో కలిసి మండలాల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యసాధనలో వెనుకంజ వేసే సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గృహనిర్మాణ ప్రగతిలో శ్రీకాకుళం జిల్లా మూడో స్థానం నుంచి నాలుగో స్థానానికి పడిపోయిందన్నారు. నిర్మాణాల్లో జాప్యం జరగకుండా సామగ్రిని ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేస్తే చెల్లింపులకు చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా లబ్ధిదారుల్లో చైతన్యం కలిగించాలన్నారు. సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారులతో సమీక్షలు నిర్వహించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకుడు ఎన్.గణపతి, పలాస ఆర్డీఓ భరత్‌నాయక్, డ్వామా పీడీ చిట్టిరాజు, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వి.వి.ఎస్.ప్రసాద్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ నాగేశ్వరరావు, అర్బన్ సహాయ ఇంజినీర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంతృప్తే లక్ష్యంగా ధాన్యం కొనుగోలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైతులు సంతృప్తి చెందేలా ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరగాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ధాన్యం సేకరణ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ సంవత్సరం కొనుగోలు ప్రక్రియ సమర్థంగా నిర్వహించాలన్నారు. ధాన్యం తరలింపునకు సంబంధించి 3800 వాహనాలకు గాను 2035 వాహనాలకు జీపీఎస్ పరికరాలు అమర్చినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ శనివారానికి పూర్తి చేస్తామని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్ద వాహన యజమాని, డ్రైవర్ మొబైల్ నంబర్లు, చిరునామాలు ఉండాలన్నారు. ధాన్యం సేకరణలో జిల్లా రెండో స్థానంలో ఉందన్నారు. ధాన్యం రవాణాకు సంబంధించి లారీ యజమానుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నాణ్యత, తూకం విషయంలో మిల్లర్లు ఇబ్బందులు పెట్టకుండా చూడాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్‌కమార్, శ్రీకాకుళం, పలాస ఆర్డీవోలు సీహెచ్. రంగయ్య, భరత్‌నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి డి.వి.రమణ, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా సహకార అధికారి ఎస్.సుబ్బారావు, జిల్లా తూనికలు, కొలతల అధికారి శంకర్ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభకు ప్రశంసాపత్రాలు



సీఐ రవికుమార్‌ను సన్మానిస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలోని పలు కేసుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులకు ఎస్పీ రాధిక బుధవారం ప్రశంసాపత్రాలు అందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదులో ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాదరావు, సారవకోట ఎస్ఐ జి.అప్పారావు, టెక్కలి ఎస్ఐ ఎల్.రామకృష్ణ, దర్యాప్తులో ఉన్న కేసుల ఫైనలైజ్‌లో భాగంగా ఎచ్చెర్ల ఎస్ఐ బాషా, శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ ఎ.విజయ్‌కుమార్, బెస్ట్ రైటర్స్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్స్, పోలీస్ హెడ్ కానిస్టేబుల్, పోలీసు కానిస్టేబుళ్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. వీరితో పాటు అంకితభావంతో విధులు నిర్వహించిన మహిళా పోలీసులకు ప్రత్యేకంగా అభినందించారు. గతంలో సోంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన రవిప్రసాద్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ

- నలుగురికి గాయాలు



క్షతగాత్రులను అంబులెన్సులోకి ఎక్కిస్తున్న సిబ్బంది

కాశీబుగ్గ: పలాస మండలం తర్లాకోటలోని స్టోన్‌క్రషర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. మెళియాపుట్టి మండలం కరజాడ గ్రామానికి చెందిన చాపర దేవరాజు తన తండ్రి బాలరాజుతో కలిసి పలాస నుంచి వస్తుండగా ఒడిశా గారబంద సమీప గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్, నవీన్‌లు ద్విచక్ర వాహనంపై వస్తూ బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో దేవరాజు కుడికాలు, ప్రేమ్‌కుమార్ కుడికాలికి తీవ్ర గాయాలయ్యాయి. వజ్రపుకొత్తూరు మండల 108 అంబులెన్సు ఈఎంటీ అవుగాన నారాయణరావు, పైలట్ దుక్క రాజేష్‌లు ఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించి పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఇద్దరు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, అర్జున్

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక సీనియర్ నేషనల్స్ బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి కె.జయకృష్ణ, ఎండీ హఫీజా ఎంపికయ్యారు. పంజాబ్‌లోని లూధియానా వేదికగా డిసెంబర్ 3 నుంచి 10 వరకు ఆలిండియా సీనియర్స్ పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్-2023 పోటీలు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ జట్లకు వీరిద్దరు ప్రాతినిధ్యం వహించనున్నారు. నవంబర్ 22 నుంచి 29వరకు చిత్తూరు వేదికగా జరిగిన శిక్షణా శిబిరాల్లో మెరుగ్గా రాణించడంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యారని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి, డీఎస్ఏ కోచ్ గాలి అర్జున్‌రావురెడ్డి తెలిపారు. జయకృష్ణ ఎల్ఎన్‌పేట సచివాలయం సర్వేయర్‌గా, ఎండీ హఫీజ శ్రీకాకుళం దిశా పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. వీరి ఎంపిక పట్ల ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, డీఎస్‌డీవో డాక్టర్ శ్రీధర్‌రావు, బాస్కెట్‌బాల్, పీఈటీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

వ్యాయామ విద్యకు ప్రోత్సాహం

- పాఠశాలతో పాటు జూనియర్ కళాశాలలకూ క్రీడా పరికరాలు
- స్థాయిని బట్టి 17 రకాల కిట్లు అందజేత
- ఇప్పటికే 2688 స్కూళ్లకు పంపిణీ



ఉన్నత పాఠశాలలకు పంపిణీ చేసిన క్రీడా పరికరాలు

నరసన్నపేట : నాడు-నేడు కార్యక్రమంతో ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పాఠశాలల్లో క్రీడలకు, వ్యాయామ విద్యపై దృష్టి సారించింది. ఫిజికల్ ఎడ్యుకేషన్‌ను బలోపేతం చేస్తూ స్కూల్ కాంప్లెక్స్‌ల్లో పీడీలు, పీఈటీలకు భాగస్వామ్యం చేసింది. దీనిలో భాగంగా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు క్రీడా సామగ్రిని సరఫరా చేయడంతో అటు విద్యార్థులు, ఇటు పీడీలు, పీఈటీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో క్రీడలను అస్సలు పట్టించుకునేవారు కాదు. దీంతో విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి తగ్గింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత క్రీడలకు ప్రాధాన్యత బాగా పెరిగింది. గ్రామీణులకు క్రీడల పట్ల ఆసక్తిని పెంచి వారిలో క్రీడా నైపుణ్యం వెలికి తీసేందుకు తగిన ప్రోత్సాహకాలు అందిస్తూ వస్తోంది. తాజాగా నాణ్యమైన క్రీడా పరికరాలు పంపిణీ చేసి అండగా నిలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 1936 ప్రాథమిక, 302 ప్రాథమికోన్నత, 378 ఉన్నత పాఠశాలలకూ, 72 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు కలిపి మొత్తం 2688 పాఠశాలలు, కళాశాలలకు పరికరాలు పంపిణీ చేసింది.

ప్రాథమిక పాఠశాలలకు:

ఉడెన్ క్రికెట్ బ్యాట్, వికెట్స్ సెట్, టెన్నిస్ బాల్, హ్యాండ్‌బాల్, ఫ్రిస్బీ మల్టీకలర్ హాలా హూప్స్, స్టెప్ హార్డిల్స్, స్కిప్పింగ్ రోప్‌లు పంపిణీ చేశారు.

ప్రాథమికోన్నత పాఠశాలలకు:

వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాస్కెట్‌బాల్, టెన్నికాయిట్ రింగ్, టెన్నికాయిట్ నెట్, స్కిప్పింగ్ రోప్స్, చెస్ సెట్, వేయింగ్ మిషన్, షాట్‌పుట్, డిస్కస్ రబ్బర్, కోన్స్ మార్క్‌గెగ్, స్టెప్ హార్డిస్, ఫ్రిస్బీ పరికరాలను సరఫరా చేశారు.

ఉన్నత పాఠశాలలు, జూనియర్ కాలేజీలకు:

వాలీబాల్స్, నెట్, త్రోబాల్, నెట్, హ్యాండ్‌బాల్స్, టెన్నికాయిట్స్, నెట్, స్కిప్పింగ్ రోప్స్, యోగా మ్యాట్స్, చెస్ సెట్ ఫుట్ ఎయిర్ పంప్, ఫుట్‌బాల్, వేయింగ్ మిషన్, షాట్‌పుట్, డిస్కస్ త్రో మెజరింగ్ టేప్, యోగా మ్యాప్, ఫుట్ పంపులను సరఫరా చేశారు. ఈ పరికరాల కోసం ఒక్కో ప్రాథమిక పాఠశాలకు రూ.3,400, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.7,800, ఉన్నత పాఠశాలకు జూనియర్ కళాశాలలకు రూ.17,700 ప్రభుత్వం ఖర్చు చేసింది.



ఉర్లాం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో క్రీడాపరికరాలు చూస్తున్న విద్యార్థులు

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు..

ఇప్పటి వరకూ సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులకు పాఠ్యప్రణాళికపై స్కూల్ కాంప్లెక్స్ నిర్వహిస్తున్నారు. ఇప్పుడు పీడీ, పీఈటీలకూ నియోజకవర్గస్థాయిలో స్కూల్స్ కాంప్లెక్స్‌లు నిర్వహిస్తున్నారు. చదువుతో పాటు క్రీడలనూ విద్యార్థులకు చేరువ చేసేందుకు తద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నారు. సహ పాఠ్య ప్రణాళికను రూపొందించేలా పీడీలు, పీఈటీలకు బాధ్యతలను అప్పగించారు. నెలవారీగా ప్రణాళికలు తయారు చేయించి అమలు చేయిస్తున్నారు.

ఇదే మొదటిసారి..



నేను పీఈటీగా, పీడీగా 15 ఏళ్ల నుంచి నుంచి పనిచేస్తున్నాను. గతంలో ఏ ప్రభుత్వమూ ఇన్ని క్రీడా పరికరాలు ఇంత నాణ్యతగా ఇవ్వలేదు. వీటి వల్ల విద్యార్థుల్లో క్రీడా సామర్థ్యం, ఆసక్తి పెరుగుతుంది. అన్ని పాఠశాలలకు క్రీడా పరికరాలు పంపిణీ చేయాలనే ప్రభుత్వ నిర్ణయం భేష్.

– రెడ్డి రవి, పీడీ, మాకివలస ఉన్నత పాఠశాల

నాణ్యతగా ఉన్నాయి..



ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడా పరికరాలు నాణ్యతగా ఉన్నాయి. ఇక నుంచి ప్రతి ఏటా ఈ విధంగా పంపిణీ చేయాలి. వ్యాయామ విద్య పట్ల ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం అభినందనీయం. మేం కూడా మా వంతు ప్రయత్నం చేసి ప్రభుత్వ ఉద్దేశాన్ని అమలు చేస్తాం.

– జ్యోతీరాణి, పీడీ, ఉర్లాం ఉన్నత పాఠశాల

అపరిచిత వ్యక్తులపై నిఘా

- ప్రాపర్టీ కేసులను నియంత్రించాలి
- నేరసమీక్షలో ఎస్పీ రాధిక



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక



సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : ప్రతిపోలీస్ స్టేషన్ పరిధిలో కార్డన్ సెర్చ్ నిర్వహించి కొత్తవ్యక్తులపై నిఘా ఉంచాలని ఎస్పీ జి.ఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అక్టోబరుకు సంబంధించిన కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాపర్టీ నేరాల నివారణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని, ఇందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో అందే ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని, రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడుతున్నప్పటికీ వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి సత్ప్రవర్తనతో నడుచుకునేలా చూడాలన్నారు. సబ్‌ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి స్వయంగా గస్తీలు నిర్వహిస్తూ నేరాలు జరగకుండా చూడాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు జి.బాలచంద్రారెడ్డి, డి.నాగేశ్వరరెడ్డి, విజయ్ కుమార్, ఎస్.వాసుదేవ్, జి.వి.ప్రసాద్, ట్రైనీ డీఎస్పీ సీహెచ్ రాజా, ఏవో పరిపాలనాధికారి సీహెచ్ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జనం హృదయాల్లో జగన్



బొర్రంపేట-స్కాట్‌పేట రోడ్డులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎల్.ఎన్.పేట: ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనం గుండెల్లో స్థానం సంపాదించారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. బుధవారం ఎల్.ఎన్.పేట మండలం బొర్రంపేట నుంచి స్కాట్‌పేట వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ముగింపు సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, మండల ప్రత్యేకాహ్వానితుడు రెడ్డి రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, పార్టీ నాయకులు లోచర్ల మల్లేశ్వరరావు, ముద్దాడ లక్ష్మణరావు, ఎర్ర జనార్దనరావు, బలగ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

తీర్థయాత్రలకు ప్రత్యేక రైలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సౌత్ సెంట్రల్ జోన్ ఏరియా మేనేజర్ చంద్రమోహన్ తదితరులు

ఆమదాలవలస: తీర్థయాత్రలకు వెళ్లాలనుకునే యాత్రికుల కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైలు నడుపుతోందని ఐఆర్‌సీటీసీ సౌత్ సెంట్రల్ జోన్ ఏరియా మేనేజర్ బి.చంద్రమోహన్ తెలిపారు. బుధవారం శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్ వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాలకు ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు చెప్పారు. డిసెంబరు 9న పుణ్యక్షేత్ర యాత్ర పేరిట పూరీ, కాశీ, అయోధ్య క్షేత్రాలను దర్శించేందుకు భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును సికింద్రాబాద్ నుంచి ప్రయాగ్‌రాజ్ వరకు నడపనున్నామని తెలిపారు. సికింద్రాబాద్‌లో బయలుదేరే ఈ రైలుకు ఖాజీపేట, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, పెందుర్తి, విజయనగరం రైల్వే స్టేషన్ల మీదుగా 15 నాటికి ప్రయాగ్ రాజ్ చేరుకుంటుందని వివరించారు. 8 రాత్రులు తొమ్మిది రోజుల టూర్ ప్యాకేజీకి ఎకానమీలో స్లీపర్ క్లాస్ రూ.15,200, స్టాండర్డ్ థర్డ్ ఏసీ రూ.24,000, కంఫర్ట్ సెకండ్ ఏసీ రూ.31,500గా నిర్ణయించినట్లు వివరించారు. వివరాలకు 8287932318, 9281495847 నంబర్లను సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గణేష్ తాప తదితరులు పాల్గొన్నారు.